క్లుప్తంగా

రోడ్డు బాగుచేయండి



మరికల్: మండల కేంద్రం నుంచి కన్సనూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలుగా మారి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఇటుక బట్టీల కారణంగా అధిక సంఖ్యలో టిప్పర్లు తిరగడంతో రోడ్డు ధ్వంసమైందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతలుగా ఏర్పడటంతో రాత్రి సమయంలో బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మరికల్: అతి తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12741 గ్రామ పంచాయతీల్లో 50వేలకు పైగా వర్కర్లు పని చేస్తున్నారని, వీరిందరిని పర్మినెంట్ చేసి నెలకు రూ. 20వేల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు.

ఉచిత కంటి చికిత్స శిబిరం



మక్తల్: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ బీమా అధ్యక్షుడు అంబాదాస్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటివైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 110మంది రోగులకు పరీక్షలు నిర్వహించగా వారిలో 60మందికి కంటిసమస్య ఉండటంతో ఆపరేషన్‌కోసం మహబూబ్‌నగర్ ఎనుగొండ కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలోని 11 వందల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంబాదాస్, చంద్రకాంత్‌గౌడ్, డివి చారి, సత్యనారాయణ, శరణప్ప, సరేందర్, అనుగొండ శ్రీనివాసులు, పృదీరాజ్, రాకేష్, అంజన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పండ్లు పంపిణీ

నారాయణపేట రూరల్ : స్థానిక మినీస్టేడియం గ్రౌండ్‌లో బుధవారం ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. అథ్లెటిక్స్ సెక్రటరీ రమణ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థి జీవితంలో ఎంతో ఉపయోగకరమైన అంశాలన్నారు. చదువుతోపాటు అన్నిరకాల కళలో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీలత, క్రీడాకారులు పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ


తేజమయూరి


వెంకటస్వామి

నర్వ: మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండలంలోని రాయికోడ్ గ్రామాని కి చెందిన నారా వెంకటస్వామి 636మార్కులు సాధించి ఆల్ ఇండియా ర్యాంక్ 42186 సాధించారు. ఎల్లంపల్లి గ్రామానికి చెందిన తేజుమయూరి 507మార్కులు సాధించి ఆల్ ఇండియా ర్యాంక్ 1988735 సాధించారు. విద్యార్థుల ప్రతిభపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు.

దామరగిద్దలో..


మమత

దామరగిద్ద: మండల కేంద్రమైన దామరగిద్దకు చెందిన ముగ్గురు అక్కచెల్లెలు వరుసగా ఎంబీబీఎస్ సీట్లు సాదిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో దామరగిద్దకు చెందిన ఉపాధ్యాయుడు వెంకటప్ప కుమార్తె మమత 569 మార్కులతో 117250 ఆల్‌ఇండియా ర్యాంక్ సాధించింది. వెంకటప్ప వృత్తి రీత్య ఉపాధ్యాయుడు కావడం తన ముగ్గురు బిడ్డలను చదివించగా మొదటి కూతురు విజయలక్ష్మి 2022లో ఎంబీబీఎస్ సాధించి డాక్టర్‌గా సొంత గ్రామంలోనే కాంట్రాక్ట్ బేసిస్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తుంది. రెండో కూతురు ప్రస్తుతం ఎస్‌వీఎస్‌లో రెండో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతుంది. మూడో కూతురు ఎంబీబీఎస్ సీటు సాధించి ర్యాంక్ రావడంపై గ్రామస్తులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు అందని 'రాయితీ'

- ఏటా సబ్సిడీపై అందించే వ్యవసాయ సామగ్రి తగ్గిస్తున్న ప్రభుత్వం
- పెట్టుబడులు పెరిగి ఇబ్బందుల్లో రెతన్నలు


వ్యవసాయ క్షేత్రంలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)


దుక్కి దున్నుతున్న రైతన్న (ఫైల్)

మాగనూర్: రైతుల ఆదాయాన్ని 2022నాటికి రెట్టింపు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా.. క్షేత్రాస్థాయిలో మాత్రం అందుకు తగ్గట్టు చర్యలేవి తీసుకోవడం లేదు. ఆధునిక కాలానికి అనుగుణంగా వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ పథకాలు రైతులకు దరిచేరడం లేదు. మరోవైపు ప్రభుత్వం వ్యవసాయ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా ఆటకెక్కిస్తూ రైతన్న ఆశలపై నీళ్లు చల్లుతోంది.

ఉమ్మడి మండలంలో..

మాగనూర్, కృష్ణా మండలంలో 29గ్రామ పంచాయతీలు ఉండగా 17వేల మంది రైతులు ఉన్నారు. గతంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే రోటోవేటర్, కల్టివేటర్, తైవాన్ స్ప్రేలు, మినీట్రాక్టర్లు, టార్పాలిన్లు వంటి తదితర రకాల వ్యవసాయ పనిముట్లను రైతులకు రాయితీపై అందించే వారు. కాని ప్రస్తుతం సదరు రాయితీ పథకం రైతులకు అందని ద్రాక్షగా మారింది. దీంతో పంటలకు అధిక పెట్టుబడి అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కొక్కటిగా ఆటకెక్కుతున్న వైనం..

వ్యవసాయశాఖ రాయితీ పథకాలు 2006–07ఆర్థిక సంవత్సరం నుంచి ఒక్కొక్కటిగా నిలిపోతున్నాయి. సేద్యంలో రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు 2014నుంచి నిలిచిపోయాయి. దీంతో చేన్లలో దున్నేందుకు ఇబ్బంది పడుతున్నామని పత్తి రైతులు వాపోతున్నారు. 2016–17వరకు అందుబాటులో ఉన్న 10నుంచి 12రకాల పనిముట్లు ఆ తర్వాత సగానికి పడిపోయాయి. తాజాగా ఆ సంఖ్య నామాత్రమైంది. దీంతో రైతులు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

మంజూరు నామమాత్రమే..

ఓ వైపు యాంత్రీకరణ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండగా మరోపక్క మంజురయ్యే యూనిట్లు కూడా నామమాత్రంగానే ఉంటున్నాయి. తైవాన్ స్ప్రేయర్లకు మంగళం పాడిన వ్యవసాయశాఖ వాటిస్థానంలో గతేడాది రిచార్జి స్ప్రేయర్లు మంజూరు చేశారు. ప్రస్తుతం రైతులకునిత్యావసరంగా మారిన టార్పాలిన్లు కూడా సరిపడా మంజూరు కావడం లేదు. గతంలో మాదిరి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని యాథావిధిగా అమలుచేసి తమ ఇబ్బందులను దూరం చేయాలని ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

సబ్సిడీపై అందించాలి..



ప్రభుత్వం మూడేళ్లుగా సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించడం లేదు. దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నాం. ధర అధికంగా ఉండటం తోపాటు నాణ్యత లేక మోసపోతున్నాం. ప్రభుత్వం గతంలో మాదిరిగా సబ్సిడీపై పనిముట్లు అందిస్తే రైతులకు ఆసరగా ఉంటుంది.

– డొల్లి నరేష్, రైతు మాగనూర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



సబ్సిడీపై పనిముట్లు, యంత్రాల కోసం రైతులు కార్యాలయానికి వస్తున్నారు. పనిముట్లు విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో ఉన్న పథకాలు రాకపోయినప్పటికీ రైతులకు ఉపయోగపడే యూనిట్లు మాత్రం మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కొన్ని పరికరాలు నామమాత్రంగానే మంజూరవడంతో రైతులకు అందడం లేదు.

– సుదర్శన్‌గౌడ్, మండల వ్యవసాయాధికారి, మాగనూర్

పర్యావరణాన్ని రక్షించుదాం


మక్తల్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు


కృష్ణాలో ..

ఊట్కూరు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తాండాలో బుధవారం మొక్కలు నాటి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. డీఆర్‌డీఓ రాజేశ్వరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. పచ్చదనం పరిరక్షించడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆమె తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీలో మొక్కలు పెంచినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఎంపీఓ రాజు, డీఏ గోపాల్, ఈసీ మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో నాయకులు మొక్కలు నాటారు. అనంతరం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సురేష్, వినయ్, ఎండీ సలాం, ఉపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈమేరకు.. హెచ్‌ఎం శేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. గ్రామంలో ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లముందు మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేంద్ర, వెంకటేష్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపులో 'పేట' మండల ఓట్లే కీలకం


నారాయణపేటలో ఓటు వేయడానికి క్యూ లో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

నారాయణపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిపై బీజేపీ అభ్యర్థి డీకే. అరుణ స్వల్ప మెజార్టీతో గెలుపొందిన విషయం పాఠకులకు విధితమే. అయితే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్నా మక్తల్, మహబూబ్‌నగర్, దేవరకద్ర, నారాయణపేట అసెంబ్లీ సెగ్మెంట్లలో డీకే అరుణకు లీడ్ వచ్చింది. మిగితా మూడు కొడంగల్, షాద్‌నగర్, జడ్చర్లలో హస్తంకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. అయితే నారాయణపేట నియోజకవర్గంలో డీకే. అరుణకు 77,046ఓట్లు రాగా, వంశీచందర్‌రెడ్డికి 57,162ఓట్లు వచ్చాయి. 19,884ఓట్ల లీడ్ రావడంతో బీజేపీ గెలుపునకు బాటలు పడ్డాయని చెప్పొచ్చు. అయితే ముఖ్యంగా నారాయణపేట మండలంలో మొత్తం 50పోలింగ్ కేంద్రాలు ఉండగా 47,838మంది ఓటర్లు ఉన్నారు. గత నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో 33,187ఓట్లు పోలయ్యాయి. వీటిలో 16,200ఓట్లు బీజేపీ, 10,782ఓట్లు కాంగ్రెస్, 4109ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులకు వచ్చాయి.

ఏ గ్రామం ఎటువైపు..

మండలంలోని బొమ్మన్‌పాడు, పేరపళ్ల, ఎక్లాస్‌పూర్, బైరంకొండ, జాజాపూర్, సింగారం, శ్యాసన్‌పల్లి, శేర్నపల్లి, బోయిన్‌పల్లి, బోయిన్‌పల్లితండా, అంత్వార్, కొల్లంపల్లి, కోటకొండ, తిర్మలాపూర్, బండగొండ, అభంగాపూర్, అప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో కమలానికి ఓట్లు ఎక్కువ పడ్డాయి. అదేవిధంగా పేరపళ్లతండా, జలాల్‌పూర్, అప్పక్‌పల్లి, కొల్లంపల్లితండా, లింగంపల్లి, అభంగాపూర్‌తండా, అమ్మిరెడ్డిపల్లిలో కాంగ్రెస్‌కు ఓట్లు అధికంగా వచ్చాయి. ఎక్కడ కూడా బీఆర్‌ఎస్ లీడ్ ఇవ్వలేదు.

ముఖ్య నాయకుల గ్రామాల్లో..

బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబన్న, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు రతంగపాండురెడ్డిల సొంత గ్రామాలు బైరంకొండ, కోటకొండ, సింగారంలో భారీగా ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ సదాశివరెడ్డి సొంత గ్రామం జలాల్‌పూర్‌లో హస్తం హవా కొనసాగింది. ఇక బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేపూర్‌రాములు సొంత గ్రామం కోటకొండ, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి సొంత గ్రామం అప్పక్‌పల్లి, మండల పరిషత్ ఎన్నికల బరిలో నిలిచిన స్థానం చిన్నజట్రంలో బీఆర్‌ఎస్‌కు చెప్పుకోదగ్గ ఓట్లు పోలయ్యాయి. జెడ్పీటీసీ అంజలి రాములు సొంత గ్రామం శేర్నపల్లిలో కారు గుర్తుకు పరాభావం తప్పలేదు. అక్కడ గుండుగుత్తగా బీజేపీకి ఓటు వేశారు.

రజకులకు సంక్షేమ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య

నారాయణపేట: రాష్ట్రంలో రజకవృత్తిపై వేలాది మంది ఆధారపడి పనిచేస్తున్నారని వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రత్యేక సంక్షేమ పథకాలు కల్పించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రజకవృత్తిదారుల సంఘం జిల్లా సదస్సు కడేంపల్లి రఘు అధ్యక్షతన చాకలివాడా కమ్యునిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 10లక్షల మందికిపైగా రజకవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, రజకులు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిదారులు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూనుకోవాలని వృత్తుల ఆధునీకరణ, ఉపాధికల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లపథకంలో వృత్తిదారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రజకులపై జరిగే దాడులు, దౌర్జన్యాలు అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కోరారు. వృత్తి ఆధునీకరణ ఉపాధికోసం నైపుణ్యతను పెంచడానికి శిక్షణ, కార్యక్రమాలు నిర్వహించాలని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ద్వారా అన్ని జిల్లాలలో వృత్తిశిక్షణ కోసం ప్రత్యేకంగా ట్రైనింగ్ కేంద్రాలు నెలకొల్పాలని కోరారు. ఆర్థిక సామాజిక అభివృద్ధికోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఎన్నికల మ్యానిఫెస్టో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి వృత్తిదారుడికి రూ.10 లక్షల ఆర్థిక సహకారం అందించాలన్నారు. ఉచిత విద్యుత్ పథకాన్ని, వృత్తిదారులపై అదనపు విద్యుత్‌భారం తగ్గించాలని, మండల కేంద్రాలలో కమ్యూనిటీ హాల్లో, మెడ్రన్ దోబీఘాట్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వృత్తిదారుల జిల్లా కన్వీనర్ గోపాల్, కడేంపల్లి రాఘు, రాష్ట్ర కమిటీ సభ్యులు, శరణప్ప, బజారు వెంకటప్ప, లలితమ్మ, మణెమ్మ, అశోక్, నాగమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుపై హర్షం


ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్న ఉందేకోడ్ బీజేపీ నాయకులు

మరికల్: మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీగా డీకే. అరుణ గెలుపుపై ఆ పార్టీ నాయకులు రాజేష్, వేణు, రామేశ్వర్‌రెడ్డి, రమేష్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ పార్టీ తరపున ఎంపీగా పోటీచేసిన డీకే. అరుణకు మండలంలో అత్యధిక ఓట్లశాతం పెరగడంతో తమ పార్టీకి అదన పు బలం పెరిగిందన్నారు. మండలంలోని 1266 ఓట్ల అధిక్యం రావడమే కాకుండా, డీకే. అరుణ గెలుపులో కీలక పాత్ర పోషించిన మండల ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నర్వ: పాలమూరు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా డీకే. అరుణ విజయంపై మండలంలోని బుధవారం పార్టీ నాయకులు గెలుపు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాయికోడ్, పెద్దకడ్మూర్, ఉందేకోడ్, కల్వాల్ గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కల్వాల్‌లో ఆలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీజేపీ కార్యకర్తలు మాజీ సర్పంచ్ జగన్నాథం, గోపాల్‌రెడ్డి, రాములుగౌడ్ పాల్గొన్నారు.

దామరగిద్ద: మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణకు ఘన విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సింగారం ఆంజనేయులు, మండల యువ మోర్చా నాయకులు యువరాజ్ మాట్లాడుతూ దేశంలో మూడోసారి మోదీ నాయకత్వాన్ని కోరుకున్న ప్రజలు బీజేపీకి పట్టం కట్టడం చారిత్రాత్మక విజయమన్నారు. కార్యక్రమంలో రాములు, తిరుపతిగౌడ్, ఆనంద్, పకీరప్ప పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ


కొంకన్‌వానిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమరచింత: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండలంలోని కొంకన్‌వానిపల్లిలో అమృత్ సరోవర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ గ్రామ శివారులోని చెరువులో వర్షపునీరు సమృద్ధిగా చెరేందుకు రైతులు, గ్రామ ప్రజలు కృషి చేయాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులో పూడికతీత పనులతో పాటు పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు లేకుండా పనులు చేయిస్తున్నామన్నారు. వర్షపు నీరు నేరుగా చెరువులోకి వెళితే పంట పొలాలతో పాటు భూగర్భ జలాలు పెరుగుతుందని అవగాహన కల్పించారు.

కొత్తకోట రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డాక్టర్ ఆసియా బేగం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఆసియాబేగం, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆసియాబేగం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాలుష్య రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో విధిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నందకిషోర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

'ఉపాధి' సమస్యలు పరిష్కరించాలి


కూలీలతో మాట్లాడుతున్న రాజు

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, ఉపాధ్యక్షుడు అజయ్ అన్నారు. బుధవారం గుంటిపల్లిలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. గురువారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని వెల్లడించారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదిస్తూ వస్తున్నారని, పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పథకాన్ని కాపాడుకునేందుకు కూలీలంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రాయచూరు శివాచార్య స్వామి రానున్నట్లు ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. ఈ మేరకు శివాచార్యస్వామికి ఆహ్వాన పత్రికను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 19నుంచి జరిగే మహా శక్తివంతమైన కాలభైరవ పాశుపత హోమాలు నిర్వహిస్తామని, స్వామి భక్తులను ఆశీర్వదించి రక్ష కంకణాలు అందజేస్తారని తెలిపారు. ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వీఓలకు యూనిఫాం బాధ్యతలు

- కుట్టు కూలి జతకు రూ.50 నుంచి 75
- ముందుకొస్తున్న గ్రామైఖ్య సంఘం మహిళలు
- జూన్ 12లోగా అందించాలని అధికారుల ఆదేశాలు


కుట్టడంపై సూచనలు ఇస్తున్న నిర్వాహకులు


ధన్వాడ ఐకేపీలో యూనిఫాం కుడుతున్న మహిళలు

ధన్వాడ: ఓ వైపు ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి మారోవైపు మహిళా సంఘాలను బోపేతం చేయాలని సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వీఓ సభ్యులకు చేతినిండా పనిలేకుండా టైలరింగ్‌లో నైపుణ్యం ఉండి ఖాళీగా ఉన్న వీఓ సభ్యులకు బృహత్తర పనిని ప్రభుత్వం అప్పగించింది. విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలు గ్రామ సమైఖ్య సంఘాల మహిళలకు అప్పగించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రాల నుంచి ఎమ్మార్సీలకు వస్త్రం రాగానే ఆయా కార్యాలయాల సిబ్బంది ఐకేపీలకు తరలించారు. దీంతో దుస్తులు కుట్టడం ప్రారంభిచారు. మండలంలో మొత్తం 41పాఠశాలలు ఉండగా, 5800మంది విద్యార్థులు విద్యనభ్యనిస్తున్నారు. వీరికి యూనిఫాం అందించేందుకు వస్త్రాలను అందజేశారు. మొత్తం మండలంలో 594 సంఘాలు ఉండగా టైలరింగ్ వచ్చిన వారిలో ప్రస్తుతం 65మంది బట్టలు కుట్టేందుకు ముందుకొచ్చారు.

పెరిగిన కుట్టు కూలి..

గతేడాది వరకు ఒక జత కుట్టు కూలి కేవలం రూ.50 ఉండగా ఈ సంవత్సరం కూడా రూ.50పెట్టారు కాని యూనిఫామ్ కుట్టేందుకు మహిళలు ఎక్కువగా ఆశక్తి చుపకపోవడంతో రూ.50 నుంచి రూ.75కు మార్పు చేశారు. దీంతో యూనిఫాం కుట్టేందుకు ముందుకొస్తున్నారు. ఇందులో కటింగ్‌కోసం రూ.5కూలి అందజేస్తున్నారు. రోజుకు టైలరింగ్ బాగా వచ్చినవారు 20 జతల వరకు యూనిఫామ్ కుడుతున్నారు. నెమ్మదిగా కుట్టే వారు 12నుంచి 15జతలను రోజు కుడుతున్నారు. ప్రస్తుతం మండలంలో ధన్వాడతోపాటు మందిపల్లి, రామకిష్టాయిపల్లి, కిష్టాపూర్, కొండాపూర్, చర్లపల్లి, గోటూర్, పాతపల్లి గ్రామాల్లోని ఐకేపీ సంఘాల వద్ద యూనిఫామ్‌లు కుడుతున్నారు.

12వ తేదీలోగా అందిస్తాం..



ఇప్పటికే వీఓ సభ్యులు యూనిఫామ్ వస్త్రాన్ని ఎమ్మార్సీ నుంచి అందుకున్నాం. ప్రస్తుతం కుట్టు కొనసాగుతుంది. జూన్ 12 పాఠశాల ప్రారంభం లోపు విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించే లక్ష్యం పెట్టుకున్నాం. అనుకున్న సమయం వరకు పూర్తి చేసేలా చూస్తాం.

– హన్మంతు, ఇన్‌చార్జి ఏపీఎం, ధన్వాడ

కార్మికుల సంక్షేమానికి కృషి

అమరచింత: ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సంగెపాగు దాసును నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సమక్షంలో కార్మిక సంఘం నాయకుడిగా దాసు నియామకపత్రం అందుకున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా దాసు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష పదవి ఇచ్చిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు.

రైతు ఆకస్మిక మృతి

ఊట్కూరు: పొలం పనులకు వెళ్తున్న రైతు ఆకస్మికంగా మృతిచెందిన సంఘటన మండలంలోని అమీన్‌పూర్‌లో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. బూతమొల్ల చంద్రప్ప(54) ఉదయం పొలం పనులకు వెళ్తుండగా స్థానిక హనుమాన్ ఆలయం వద్ద ఆకస్మాత్తుగా కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మూడేళ్ల క్రితం కరోనా భారినపడి మృతిచెందినట్లు తెలిపారు. రైతు ఆకస్మికంగా మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.